- రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి
- మండలంలోని పలు గ్రామాల్లో ముమ్మర ప్రచారం
- ప్రతి ఇంటికీ అందిన పథకాలు బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మాటలు నమ్మొద్దు
- మరోసారి ఆశీర్వదిస్తే ముచ్చర్ల వరకు మెట్రోను తీసుకొస్తానని వెల్లడి

## రంగారెడ్డి-పాలమూరుతో..

# ప్రతి ఎకరానికీ సాగునీరు



కేంద్ర మంత్రి కిషన్ స్వగ్రామం తిమ్మాపూర్‌లో మంత్రి సబితారెడ్డిపై పులవర్షం కురిపించి ఘన స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

కందుకూరు, నవంబర్ 20 : రంగారెడ్డి-పాలమూరు ఎత్తిపోతల పథకం ద్వారా ప్రతి ఎకరానికీ సాగు నీటితోపాటు తాగునీటిని కూడా అందిస్తామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని సరస్వతీగూడ, అగర్‌మియగూడ, తిమ్మాపూరు, జబ్బార్‌గూడ, బేగంపేట్, రాచులూరు, బైరాగిగూడ, కొత్తూరు తదితర గ్రామాల్లో ఆమె రోడ్ షో నిర్వహించి మాట్లాడారు. అంజన్న ఆలయం లేని ఊరు లేదని.. ప్రభుత్వ పథకం అందని గడప లేదని స్పష్టం చేశారు. తాను స్థానికురాలిని కాదని బీజేపీ నాయకులు అంటున్నారని.. మరి మీ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్థానికుడా అని ప్రశ్నించారు. ఆయన సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి ఎందుకు పోటీ చేస్తున్నాడన్నారు. సీఎ కేసీఆర్‌కు కందుకూరు అంటే అమితమైన ప్రేమ ఉందన్నారు. తనను ఈ ఎన్నికల్లో గెలిపిస్తే ముచ్చర్ల గేటు వరకు మెట్రోతోపాటు మెడికల్ కళాశాల, 450 పడకల దవాఖానను తీసుకొస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చే మోసపూరిత హామీలను నమ్మొద్దని ప్రజలకు సూచించారు. ఆ పార్టీ నాయకులు అధికారంలోకి వస్తే రాష్ట్రాన్ని అమ్ముతారని ఆరోపించారు. కరోనా వస్తే సీఎం కేసీఆర్ అన్ని వర్గాల వారిని ఆదుకున్న విషయాన్ని ఈ సందర్భంగా మంత్రి సబితారెడ్డి గుర్తుచేశారు. కాంగ్రెస్, బీజేపీలతో అప్రమత్తంగా ఉండాలన్నారు. సీఎం కేసీఆర్ సబ్బండ వర్ణాల అభ్యున్నతికి ఎంతో కృషి చేస్తున్నారని.. సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. ఈ నెల 30న కారు గుర్తుపై ఓటు వేసి తనను గెలిపిస్తే.. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లోనూ ముందుండేలా తీర్చిదిద్దుతానన్నారు. కార్యక్రమంలో ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు చిలకమర్రి నర్సింహ, జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి. మార్కెట్ కమిటీ చైర్మన్ సురుసాని సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్, వైస్ చైర్మన్ గోపిరెడ్డి విజేందర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు సురుసాని రాజశేఖర్‌రెడ్డి, సీనియర్ నాయకులు లక్ష్మీనర్సింహారెడ్డి, ఈశ్వర్‌గౌడ్, మండలాధ్యక్షుడు జయేందర్‌ముదిరాజ్, మేఘనాథ్ రెడ్డి, పార్టీ మహిళా అధ్యక్షురాలు ఇందిరమ్మాదేవేందర్, మాజీ ఎంపీపీ శోభాఈశ్వర్‌గౌడ్, సాయిలు, కవితాకరుణాకర్‌రెడ్డి, అంజయ్యగౌడ్, బాల్‌రెడ్డి, గణేశ్ రెడ్డి, సర్పంచ్‌లు రాము, భూపాల్‌రెడ్డి, పరంజ్యోతి, గోపాల్‌రెడ్డి, గోవర్ధన్, శ్రీనివాసాచారి, రామకృష్ణారెడ్డి, నరేందర్‌గౌడ్, వెంకటేశ్‌గౌడ్, నర్సింహ, శ్రీరాములు, రవికాంత్‌రెడ్డి, సదానంద్‌గౌడ్, సామయ్య, ఆనంద్, దేవీలాల్, కార్తిక్, దీక్షిత్‌రెడ్డి, వెంకటేశ్‌గౌడ్, శేఖర్ గుప్తా, శివశంకర్, రవి ముదిరాజ్, రాంరెడ్డి, శ్రీను నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్వగ్రామంలో ఘన స్వాగతం

కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు గంగాపు రం కిషన్‌రెడ్డి స్వగ్రామం తిమ్మాపూరు గ్రామంలో ప్రజలు బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిని, మంత్రి సబితారెడ్డికి బ్రహ్మరథం పట్టారు. మహిళలు, పురుషులు, యువకులు పెద్ద ఎత్తున తరలివచ్చి బతుకమ్మ ఆడడంతోపాటు మంత్రిపై పూలవర్షం కురిపించి పటాకులు కాలుస్తూ మంత్రికి ఘన స్వా గతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి గ్రామంలోని అన్ని వీధుల్లో కలియదిరిగారు. కారు గుర్తుకు ఓటేయాలని ప్రజలకు సూచించారు.



మద్దతు తెలిపేందుకు వచ్చిన టీడీపీ నాయకులతో మాట్లాడుతున్న రాష్ట్ర పౌరసఫరాల శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి

## పట్నంకు పార్టీలకతీతంగా మద్దతు

**పౌరసరఫరాల శాఖ మంత్రి మహేందర్ రెడ్డి**

కోస్గి, నవంబర్ 20 : బీఆర్‌ఎస్ పార్టీ కొడంగల్ అభ్యర్థి, ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డికి పార్టీలకతీతంగా మద్దతు పెరుగుతున్నదని పౌరసరఫరాల శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన కోస్గిలో మాట్లాడుతూ సెగ్మెంట్‌లో రాజకీయాలు, పార్టీలతో సంబంధం లేకుండా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సామల వెంకటప్రసాద్‌తోపాటు మండలాల ఇన్‌చార్జిలు మద్దతు తెలుపుతూ నరేందర్‌రెడ్డి గెలుపునకు ఊరూరా ప్రచారం చేస్తామని చెప్పడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం సామల వెంకటప్రసాద్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి గెలుపునకు సంపూర్ణంగా కృషి చేస్తామన్నారు. రేవంత్‌రెడ్డికి ఘోర ఓటమి తప్పదన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ మాజీ మేయర్ బాబా ఫసీయుద్దీన్, మున్సిపల్ అధ్యక్షుడు రాజేశ్, కౌన్సిలర్లు బాలేశ్, శ్రీనివాస్, మల్లేశ్, టీడీపీ జిల్లా ఇన్‌చార్జ్ నీలం రవిమోహన్, నారాయణ, రహీం, రమేశ్, గుప్తారాజు, మహేశ్ పాల్గొన్నారు.

## ఓయూలో వివిధ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 20: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెస్సీ (అప్లైడ్ న్యూట్రిషన్), ఎమ్మెస్సీ (స్పోర్ట్స్ న్యూట్రిషన్) కోర్సుల నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షా ఫీజును ఈ నెల 23వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలన్నారు. రూ.300 అపరాధ రుసుముతో 29వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కెమిస్ట్రీ తొమ్మిదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును ఈ నెల 23వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించవచ్చని పేర్కొన్నారు. రూ.300 అపరాధ రుసుముతో వచ్చే నెల 2వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

### బీఏఎస్‌ఎల్‌పీ పరీక్ష ఫలితాల..

## రీవాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 20: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఏఎస్‌ఎల్‌పీ పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు మొదటి, మూడు, అయిదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని తెలిపారు. ఫలితాలను తమ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. మార్కు మెమోలను సంబంధిత కళాశాల నుంచి మూడు వారాల తరువాత పొందవచ్చన్నారు. ఈ ఫలితాల రీవాల్యుయేషన్‌కు ఒక్కో పేపర్‌కు రూ.500 చొప్పున చెల్లించి.. ఈ నెల 22వ తేదీలోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.200 అపరాధ రుసుముతో 24వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరే వారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి.. ఈ నెల 24వ తేదీ వరకు తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.



ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ తాండూరు అభ్యర్థి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

# మేధావులారా.. ఆలోచించి ఓటేయండి

- తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరిగిన అభివృద్ధిని చూడండి
- కారు గుర్తుకు ఓటేసి గెలిపించండి
- ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు, ఉపాధ్యాయుల సమ్మేళనంలో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు, నవంబర్ 20 : సమసమాజ నిర్మాణానికి మార్గదర్శకులైన ఉపాధ్యాయ మేధావులారా...ఆలోచించి ఓటేయండని బీఆర్‌ఎస్ పార్టీ తాండూరు అభ్యర్థి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి తాండూరు పట్టణంలోని సల్లా గార్డెన్‌లో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో తాండూరు ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రం, సీమాంధ్ర పాలనలో తెలంగాణ రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందన్నారు. కాగా.. సీఎం కేసీఆర్ పోరాటంతో ఏర్పడిన ప్రత్యేక రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నదన్నారు. ఇంటింటికీ ప్రభుత్వ పథకాలను అందించి ఆదుకుంటున్నదని, విద్యావైద్యంలో విప్లవాత్మకమైన మార్పులొచ్చాయన్నారు. పల్లె, పట్టణాలకు ప్రత్యేక నిధులను కేటాయించి మౌలిక వసతులను కల్పించినట్లు గుర్తుచేశారు. ముఖ్యంగా నియోజకవర్గంలో గడిచిన తొమ్మిదిన్నరేండ్లలో రూ.1672.49 కోట్ల అభివృద్ధి పనులు చేసినట్లు, రూ.1648.12కోట్ల సంక్షేమ పథకాలను ప్రజలకు అందించామన్నారు. తాండూరు పట్టణాభివృద్ధి కోసం రూ.1191.86 కోట్లు, తాండూరు మండలంలో అభివృద్ధి పనులకు రూ.236.14కోట్లు, యాలాల మండలంలో రూ. 97.77 కోట్లు, బషీరాబాద్ మండలంలో రూ. 68.18 కోట్లు, పెద్దేముల్ మండలంలో ప్రగతి పనులకోసం రూ.78.54 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రాగానే ఎకరానికీ రూ.16 వేల చొప్పున రైతు బంధు అందించడంతోపాటు, సౌభాగ్యలక్ష్మి పేరుతో ప్రతి పేద మహిళకూ రూ.3000 చొప్పున పంపిణీ, రూ.400లకే వంట గ్యాస్, ప్రతి కుటుంబానికీ రూ.5 లక్షల వరకు బీమా సౌకర్యం తదితర పథకాలను అమలు చేయనున్నట్లు వివరించారు. మరోసారి అవకాశమిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని స్పష్టం చేశారు. కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాల లనిర్వాహకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**బీజేపీ నుంచి బీఆర్‌ఎస్‌లోకి..**

యాలాల్, నవంబర్ 20 : సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని బానాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ వికారాబాద్ జిల్లా కార్యనిర్వాహక సభ్యుడు రమ్యానాయక్ ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా రామ్యానాయక్ మాట్లాడుతూ బీజేపీ మాటలు నమ్మి మోసపోయినట్లు తెలిపారు. తమలా ఎవరూ బీజేపీ, కాంగ్రెస్ ఉచ్చులో పడొద్దన్నారు.



హాజరైన ఉపాధ్యాయులు, ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు